టైటానిక్‌కు ఐదు రెట్లు పెద్దది

27న విలాసవంతమైన ఐకాన్ ఆఫ్ ద సీస్ ప్రారంభం

ప్రపంచంలోనే అతి పెద్ద ఓడగా రికార్డ్

పోన్స్ (ఫ్యూర్టో రికో), జనవరి 20: టైటానిక్ ఓడతో పోల్చితే ఐదు రెట్లు పెద్దది, 20 అంతస్తులు (డెక్స్) కలిగిన అత్యంత విలాసవంతమైన భారీ ఓడ 'ఐకాన్ ఆఫ్ ద సీస్' ప్రయాణికుల కోసం సిద్ధమైంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఓడగా రికార్డు సృష్టించిన 'ఐకాన్ ఆఫ్ ద సీస్' మొదటి సముద్ర ప్రయాణం ఈ నెల 27న మియామి (అమెరికా) నుంచి మొదలుకానున్నది. ప్రయాణికులకు అత్యద్భుతమైన అనుభూతిని కలిగించే సెంట్రల్ పార్క్, వాటర్ పార్క్, థ్రిల్ ఐలాండ్, స్విమింగ్ పూల్స్..ఇలా 8 రకాల సౌకర్యాలు ఇందులో ఉన్నాయి. ఐకాన్ ఆఫ్ సీస్..కరీబియన్ దీవుల్లోని 'పోన్స్' (ఫ్యూర్టో రికో)కు చేరుకోగా, అక్కడ అధికారులు కొన్ని తనిఖీలు నిర్వహించారు.

విశేషాలు..	
అంతస్తులు..	20
పొడవు..	365 మీటర్లు
గదులు	2805
బరువు	2,50,800 టన్నులు
ప్రయాణికుల సామర్థ్యం	7,600
పనిచేసే సిబ్బంది	2,350
నిర్మాణం	రాయల్ కరీబియన్ ఇంటర్నేషనల్ కంపెనీ
నిర్మాణ ఖర్చు	రూ. 16,624 కోట్లు
ఇంధనం	ద్రవరూప సహజవాయువు

లింగ మార్పిడి ద్వారా తండ్రి అయిన మహిళ

ముంబై : మహారాష్ట్రకు చెందిన లలిత్ సాల్వే (36) ఓ బిడ్డకు తండ్రి అయ్యారు. ఇది సాధారణమే కదా అనుకోకండి! జన్మతః లలిత్ స్త్రీ. కుటుంబంలో బాలిక (లలిత)గానే పెరిగి పెద్దయ్యారు. బీడ్‌కు చెందిన లలిత్ 2010లో మహారాష్ట్ర పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. 2013 నుంచి ఆమెలో ట్రాన్స్-సెక్సువల్ జెండర్ లక్షణాలు కనిపించడం మొదలైంది. నాలుగేళ్ల తర్వాత 2017లో చేయించిన పరీక్షల్లో ఆమె శరీరంలో 'వై' క్రోమోజోమ్ ఉన్నట్లు వెల్లడైంది. 2018-2020 మధ్య కాలంలో మూడుసార్లు సెక్స్ రీఅసైన్‌మెంట్ సర్జరీ చేయించుకున్నారు. 2020లో సీమ అనే యువతిని పెండ్లి చేసుకున్నారు. వీరిద్దరికీ ఈ నెల 15న ఓ మగ బిడ్డ జన్మించాడు. తాను స్త్రీ నుంచి పురుషునిగా మారే కాలంలో అనేక మంది తనకు మద్దతుగా నిలిచారని లలిత్ చెప్పారు.

మయన్మార్ సరిహద్దుల్లో కంచె

- స్వేచ్ఛా సంచారానికి త్వరలో ముగింపు పలుకుతాం
- కేంద్రహోంమంత్రి అమిత్‌షా ప్రకటన
- మయన్మార్ అంతర్యుద్ధంతో దేశంలోకి పెద్దయెత్తున శరణార్థులు

గువాహటి, జనవరి 20: మయన్మార్‌లో సైనిక పాలకులు, తిరుగుబాటు దళాలకు మధ్య జరుగుతున్న అంతర్యుద్ధం భారత్‌పై ప్రభావం చూపుతున్నది. ఆ దేశానికి చెందిన వందలాది మంది సైనికులు పారిపోయి సరిహద్దు రాష్ట్రమైన మిజోరామ్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో దీన్ని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్న రాష్ట్ర సీఎం లాల్‌దుహోమా అభ్యర్థనపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పందించారు. సరిహద్దుల్లో స్వేచ్ఛా సంచారాన్ని నియంత్రిస్తూ బంగ్లాదేశ్ సరిహద్దుల మాదిరిగానే మయన్మార్ సరిహద్దులో కూడా త్వరలో కంచె వేస్తామని ప్రకటించారు. అస్సాంలోని గువాహటిలో శనివారం జరిగిన అస్సాం పోలీస్ కమాండోస్ పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమంలో అమిత్‌షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగ్లాదేశ్ సరిహద్దుల మాదిరిగానే మయన్మార్‌తో భారత్ సరిహద్దులను కూడా పరిరక్షిస్తామన్నారు. మయన్మార్‌తో చేసుకొన్న సరిహద్దుల్లో స్వేచ్ఛా సంచారానికి సంబంధించిన ఒప్పందం(ఎఫ్ఎంఆర్)పై పునఃపరిశీలన చేస్తామని, త్వరలో దానికి ముగింపు పలుకుతామని తెలిపారు. ప్రస్తుత్తం రెండు దేశాల మధ్య అమల్లో ఉన్న ఒప్పందం మేరకు భారత్-మయన్మార్ సరిహద్దుల్లోని 16 కిలోమీటర్ల పరిధిలో నివసించే ఇరుదేశాల ప్రజలు వీసా లేకుండా, ఎలాంటి భద్రతా తనిఖీలు లేకుండా ఒకరి భూభాగాల్లోకి మరొకరు వెళ్లేందుకు అవకాశం ఉన్నది.

సైనిక పాలకులు, తిరుగుబాటు దళాలకు మధ్య పోరు

మయన్మార్‌లో 2021లో సైన్యం ప్రభుత్వాన్ని కూల్చి పాలనా పగ్గాలు చేజిక్కించుకొన్నది. అయితే గత కొంత కాలంగా ప్రజాస్వామ్య అనుకూలవాదులతో కూడిన సాయుధ బృందాలు కూటములుగా సైనిక పాలనను ప్రతిఘటిస్తున్నాయి. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్య ఘర్షణలతో మయన్మార్‌లో అంతర్యుద్ధం నెలకొన్నది. ఈ ఘర్షణల వల్ల ఇప్పటి వరకు దాదాపు 600 మంది సైనికులు సరిహద్దులు దాటి మన దేశంలోకి ప్రవేశించినట్టు సమాచారం. అంతర్యుద్ధం కారణంగా శరణార్థులు సరిహద్దుల గుండా పెద్దయెత్తున దేశంలోకి ప్రవేశిస్తుండటంపై భారత్ గత నెల తన ఆందోళనను మయన్మార్ పాలకుల దృష్టికి తీసుకెళ్లింది.

ఆపలేం.. కానీ వ్యతిరేకిస్తాం

మయన్మార్ సరిహద్దులో త్వరలో కంచె వేస్తామని, ఎఫ్ఎంఆర్ ఒప్పందాన్ని రద్దు చేస్తామన్న అమిత్‌షా ప్రకటనపై మిజోరం సీఎం లాల్‌దుహోమా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం కంచె వేయడాన్ని అడ్డుకొనే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, అయితే దీన్ని వ్యతిరేకిస్తామని పేర్కొన్నారు. మయన్మార్‌లోని చిన్ కమ్యూనిటీ ప్రజలతో మిజోలకు జాతిపరమైన సంబంధాలు ఉన్నాయని, కేంద్రం నిర్ణయాన్ని రెండు వైపులా నివసించే మిజో ప్రజలు ఆమోదించరని అన్నారు.

మరాఠా రిజర్వేషన్ల కోసం ఆఖరి శ్వాస వరకు పోరాటం: జరాంగే

జాల్నా, జనవరి 20: తన ఆఖరి శ్వాస వరకు మరాఠాల రిజర్వేషన్ల కోసం పోరాడుతానని మరాఠా రిజర్వేషన్ల పోరాట నేత మనోజ్ జరాంగే స్పష్టం చేశారు. మహారాష్ట్రలో మరాఠాలకు ఓబీసీ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ముంబై వరకు నిర్వహించే నిరసన ర్యాలీని వేలాదిమంది మద్దతుదారులతో శనివారం ఆయన జాల్నాలో ప్రారంభించారు. ర్యాలీ ప్రారంభానికి ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ మరాఠాలకు రిజర్వేషన్ల కల్పనలో విఫలమైన సీఎం షిండే ప్రభుత్వ క్రూర, కఠిన వైఖరిపై తీవ్రంగా మండిపడ్డారు. రిజర్వేషన్లు కల్పించాలని తాము ప్రభుత్వానికి ఏడు నెలల సమయమిచ్చామని, ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. రిజర్వేషన్లు కల్పించే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని, తన ఆఖరి శ్వాసవరకు దీనిపై పోరాటం చేస్తానని జరాంగే ప్రమాణం చేశారు. మరాఠా యువత ప్రాణాలు కోల్పోతున్నా ఇంత క్రూరంగా, దయ లేకుండా ప్రభుత్వం ఎలా ఉంటున్నదని ఆయన ప్రశ్నించారు. మరాఠా రిజర్వేషన్ల డిమాండ్‌పై మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే స్పందించారు. రాష్ట్ర బీసీ కమిషన్‌తో జనవరి 23 నుంచి సర్వే చేపడతామని, మరాఠా సామాజికవర్గంలో సామాజిక, ఆర్థిక వెనుకబాటును అంచనా వేస్తామని శనివారం ప్రకటించారు.

ఈడీ విచారణ సందర్భంగా సోరెన్ నివాసం వద్ద సీఐఎస్ఎఫ్ బలగాల బందోబస్తు

జార్ఖండ్ సీఎంపై ఈడీ ప్రశ్నల వర్షం

- సోరెన్ నివాసం వద్ద ఉద్రిక్తత

రాంచీ, జనవరి 20: భూ కుంభకోణానికి సంబంధించి మనీలాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌పై ఈడీ విచారణ మొదలైంది. శనివారం మధ్యాహ్నం సీఎం అధికారిక నివాసానికి చేరుకున్న ఈడీ అధికారులు కేసుకు సంబంధించి ఆయన్ని కొన్ని గంటలపాటు ప్రశ్నించింది. రాష్ట్ర సీఎం, అధికార పార్టీ 'జేఎంఎం'కు ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా వున్న హేమంత్ సోరెన్(48)కు ఈడీ 7సార్లు సమన్లు జారీ చేసింది. 8వ సారి పంపిన ఈడీ సమన్లను సీఎం హేమంత్ సోరెన్ అంగీకరించక తప్పలేదు. దీంతో వెంటనే ఈడీ విచారణకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో శక్తివంతమైన బాడీ కెమరాలను వెంటబెట్టుకొని పదుల సంఖ్యలో ఈడీ అధికారులు ఆయన నివాసానికి చేరుకోవటం, వారికి భద్రతగా పెద్ద ఎత్తున సీఐఎస్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగటం వార్తల్లో నిలిచింది. అంతేగాక సీఆర్‌పీఎఫ్ బలగాలను పెద్ద సంఖ్యలో మోహరించారు. ఈనేపథ్యంలో సీఎం నివాసం వద్దకు జేఎంఎం ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఓ వైపు సీఎంను ఈడీ విచారిస్తుండగా, మరోవైపు జేఎంఎం ఎమ్మెల్యేల సమావేశం కావటం చర్చనీయాంశమైంది. సీఎం సోరెన్‌ను అరెస్టు చేస్తున్నారన్న వార్తలు జేఎంఎం పార్టీ వర్గాల్ని ఆందోళనకు గురిచేశాయి.

నాకు వ్యతిరేకంగా కుట్ర

తనకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతున్నదని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఆరోపించారు. సుమారు ఏడు గంటల పాటు ఈడీ విచారించిన తర్వాత తన ఇంటి వద్ద పెద్ద సంఖ్యలో హాజరైన అభిమానులు, పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 'నాకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోంది. మీ నేత ఎన్నడూ భయపడబోడు.' అని అన్నారు. ఇలాంటి సమయంలో తనకు అండగా ఉన్న వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

15 ఏండ్లకోసారి 10 వేల కోట్ల ఖర్చు

- జమిలి విధానంలో ఈవీఎంలకయ్యే వ్యయమిది: ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ, జనవరి 20: దేశంలో ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల నిమిత్తం ప్రతి 15 ఏండ్లకోసారి 10 వేల కోట్ల రూపాయల నిధులు అవసరమవుతాయని భారత ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖకు వివరాలు పంపింది. ప్రస్తుతమున్న ఈవీఎంల జీవిత కాలం 15 ఏండ్లని, జమిలి ఎన్నికలను వరుసగా మూడుసార్లు నిర్వహించడానికి వాటిని వినియోగించవచ్చునని ఈసీ తెలిపింది. ఈ ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలకు 11.80 లక్షల పోలింగ్ స్టేషన్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నామంది. జమిలి ఎన్నికలు నిర్వహిస్తే ఒక్కో పోలింగ్ బూత్‌కు రెండు సెట్ల ఈవీఎంలు అవసరమవుతాయని, అందులో ఒకదానిని లోక్‌సభకు, రెండో దానిని అసెంబ్లీ పోలింగ్‌కు వినియోగిస్తామన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ తేదీన కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్ మిషన్లు కొన్ని రిజర్వ్‌లో ఉంచాలన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే జమిలి ఎన్నికలకు కనీసం 46,75,100 బీయూలు, 33,63,300 సీయూలు, 36,62,600 వీవీప్యాట్‌లు అవసరమవుతాయని వివరించింది.

గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా మాక్రాన్!

న్యూఢిల్లీ, జనవరి 20: ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశాలున్నాయి. రెండు రోజులపాటు భారత్‌లో పర్యటించనున్న మాక్రాన్ పలు ఒప్పందాలు చేసుకోనున్నారు. ముఖ్యంగా రక్షణ, భద్రత, క్లీన్ ఎనర్జీ, వాణిజ్యం, పెట్టుబడులు, కొత్త సాంకేతికత తదితర రంగాల్లో ఒప్పందాలు జరుగనున్నట్టు తెలుస్తున్నది. పర్యటనలో భాగంగా మాక్రాన్ ఢిల్లీతోపాటు జైపూర్‌ను సందర్శించనున్నారు.

రిపబ్లిక్ పరేడ్‌లో ఆర్మీ దంపతులు

న్యూఢిల్లీ : గణతంత్ర దినోత్సవాల్లో భాగంగా జరిగే కవాతులో మేజర్ జెర్రీ బ్లెయిజ్, ఆయన సతీమణి కెప్టెన్ సుప్రీత రికార్డు సృష్టించబోతున్నారు. వీరిద్దరూ వేర్వేరు కంటింజెంట్లలో సభ్యులుగా ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో కవాతు చేయబోతున్నారు. దంపతులు కవాతు చేయడం గణతంత్ర దినోత్సవాల చరిత్రలో ఇదే తొలిసారి అని మేజర్ బ్లెయిజ్ చెప్పారు. ఈ అవకాశం కాకతాళీయంగా వచ్చిందని చెప్పారు. 2023 జూన్‌లో తమకు వివాహం జరిగిందని తెలిపారు. సుప్రీత మాట్లాడుతూ, మొదట తాను ఎంపిక పరీక్షలో విజయం సాధించానని, ఆ తర్వాత తన భర్త రెజిమెంట్‌లో ఎంపికయ్యారని చెప్పారు.

ఉత్తరాదిని వీడని పొగమంచు

న్యూఢిల్లీ, జనవరి 20: దట్టమైన పొగమంచు, చలిగాలులతో ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు గజ గజ వణికిపోతున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మరో రెండు రోజులపాటు కొనసాగుతాయని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ రోడ్డుపై ప్రయాణించాలని భారత వాతావరణ శాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. తీవ్రమైన చలిగాలులు, పొగమంచు తాకిడి ఢిల్లీ, బీహార్, మధ్యప్రదేశ్ సహా మరి కొన్ని రాష్ట్రాలకు విస్తరిస్తుందని పేర్కొన్నది. శనివారం ఉదయం ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత 6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. వెలుతురు సరిగా లేక పలు రాష్ట్రాల్లో రోడ్డు, రైలు రవాణా స్తంభించిపోయింది.